www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 3 సెప్టెంబర్ 2025

సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప : పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం కడప నగరం ప్రకాష్ నగర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమీకృత వెనుకబడిన తరగతుల బాలుర వసతి సముదాయాన్ని జడ్జి సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వంటశాలను, వసతి గదులను, టాయిలెట్లను, స్టోర్ రూమును పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు. పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని, విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. విద్య విలువైన క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్లతో నాణ్యమైన భోజనం

- విద్య, ఐటి శాఖ మంత్రి లోకేష్

స్మార్ట్ కిచెన్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె/కడప అర్బన్

స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేయడంతో నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించవచ్చని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని విద్య, ఐటి శాఖ మంత్రి లోకేష్ అన్నారు. దేశంలోనే తొలిసారిగా కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని చింతకొమ్మదిన్నె ఎంపిపి పాఠశాల ఆవరణలో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ అడ్వాన్స్‌డ్ స్మార్ట్ కిచెన్‌ను లోకేష్ మంగళవారం ప్రారంభించారు. కమలాపురం 2, జమ్మలమడుగు 2, కడపలో 1 స్మార్ట్ కిచెన్‌ను మంత్రి లోకేష్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ఈ 5 స్మార్ట్ కిచెన్ల ద్వారా 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు 13 ప్రత్యేక వాహనాల్లో ఆహారాన్ని పంపిస్తారని పేర్కొన్నారు. న్యూట్రిషనిస్ట్ పర్యవేక్షణలో సోలార్ పవర్‌తో పనిచేసే ఈ స్మార్ట్ కిచెన్‌లో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తారని తెలిపారు. మెరుగైన నాణ్యత కోసం ఇక్కడ ప్రత్యేక ఏర్పాటుచేసిన ఆర్ఒఆర్ ప్లాంటును ఏర్పాటు చేశామన్నారు. స్మార్ట్ కిచెన్‌ను ప్రారంభించిన తర్వాత అనంతరం ఆయన స్థానిక విద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యార్థుల లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో విద్యార్థులకు అందిస్తున్న పలు పథకాలు, నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లవేళలు పాటుపడుతుందని భరోసాని ఇచ్చారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సందేహాలను నివృత్తి చేశారు. అంతకుముందు మంత్రి నారా లోకేష్ పెండ్లిమర్రి మండలంలోని పగడాలుపల్లెలో ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పురుషుల వసతి గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూసా 2.0 నిధులతో రూ.12 కోట్లతో నూతన భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. రూ.10.5 కోట్లతో వైవీయూ భవనాలకు మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. కొప్పర్తి ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ లో నూతనంగా ఏర్పాటైన ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనం, టెక్నోడోమ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్ లోని టెక్సానా వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూఎక్కడైతే మహిళలు గౌరవింపబడుతారో అపుడే సమాజం కూడా గౌరవంగా ఎదుగుతుందన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తేనే ఆ కుటుంబంతో పాటు ఆ సమాజం మొత్తం అభివృద్ధి పథంలోకి వెళుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మ, పరిశ్రమలు, వాణిజ్య శాఖా మంత్రి మంత్రి టిజి భరత్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, కమ లాపురం, కడప ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, మాధవి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, జెసి అదితి సింగ్, ఎస్‌పి అశోక్‌కుమార్, యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ అల్లం శ్రీని వాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి, పి.ఎం.ఉష విశ్వవిద్యాలయ సమన్వయకర్త డాక్టర్ తుమ్మల చంద్ర శేఖర్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ చద్రమతి శంకర్, మాదక్క, ఎపిఐఐసి ఎమ్‌డి అభిషిక్త్ కిషోర్, టెక్నో డోమ్ కంపెనీ సిఎండి సాకేత్ గౌరవ్, ప్లాంట్ హెడ్, విక్టర్ ప్రేమ్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ ఫ్రాంక్లిన్ జోష్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్‌డిఒ జాన్ ఎర్విన్, ఎపిఐఐసి జెడ్‌ఎం శ్రీనివాస మూర్తి, డిఐసి జిఎం చంద్‌బాషా పాల్గొన్నారు.

కొప్పర్తి ఇండస్ట్రియల్‌లో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న లోకేష్

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

ఎల్ఐసి కాంప్లెక్స్‌లో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - కడప అర్బన్

బీమా వారోత్సవాలలో భాగంగా ఎల్ఐసి ఉద్యోగులు స్థానిక డివిజనల్ కార్యాలయ ఆవరణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కల్ని, చెత్తా చెదారాన్ని తొలగించారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి. రవికుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ఎల్ఐసి సభా భవనంలో క్విజ్ నిర్వహించారు. మొత్తం 5 టీమ్‌లు పాల్గొన్నాయి. 13 రౌండ్లు నిర్వహించారు. శాస్త్రి, సుధాకర్, రాకేష్, ఆర్కాట్ శ్రీనివాస్‌తో కూడిన కమిటీ నిర్వహించింది. అనంతరం కడప గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినులకు ఎల్ఐసి అధికారులు క్విజ్ నిర్వహించారు. '78 ఏళ్లస్వతంత్ర భారతం' అనే అంశంపై నిర్వహించారు. మొత్తం 14 మంది విద్యార్థినులు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - కడప

ప్రజాస్వామ్యంలో మోసాలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని రద్దుచేసి తక్షణం ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపించాలని ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, సత్తార్ డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జాకీర్, ఆసిఫ్ ఖాన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాకీర్, ఆసిఫ్ ఖాన్ ఎఐసిసి కో-ఆర్డినేటర్ ఎస్.ఎ.సత్తార్, హేతువాద సంఘం నాయకులు సి.ఆర్.వి. ప్రసాద్, ఆర్ఎస్‌పి సుబ్బరాయుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్వర్ మాట్లాడారు. దేశంలో బిజెపితో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై అవకతవకలు జరిపి ఓట్లు దొంగతనం చేసి ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. తప్పుల తడకగా ఉన్న ఎన్నికల ఓటర్ల లిస్టును రాహుల్ గాంధీ 70 నిమిషాల పాటు మీడియా సమక్షంలో ప్రజెంటేషన్ చేసి ఆధారాలతో నిరూపించారు అన్నారు. అనేక మోస పూరిత కుట్రలతో ఎన్నికల మోసాలతో అధికారంలోకి వచ్చే విధానాన్ని కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిలోని పార్టీలు , పలు ప్రజా సంఘాలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. బీహార్ రాష్ట్రంలో ఈ ఎన్నికల మోసాన్ని ప్రజలకు వివరిస్తూ రాహుల్ గాంధీ యాత్ర నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో మోసాలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని రద్దుచేసి తక్షణం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాసిర్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ బీమా అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి ఒక్కరికీ బీమా అవసరమని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. కడప ఐఎంఎ హాల్‌లో మంగళవారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు 50 సంవత్సరాల స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన సెన్సేషనల్ సెప్టెంబర్ – 2025 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఏజెంట్స్ వినియోగదారులకు నిజాలు బాగా చెప్పి బీమా చేయించాలన్నారు. బిజినెస్‌తో పాటు వినియోగదారులకు మంచి సేవలు అందించిన సంస్థ మరింత పురోభివృద్ధి చెందాగలదన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు సిఇఒ రమేష్ మాట్లాడుతూ చిన్న బీమాలలో శ్రీరామ్ రాయలసీమలో ప్రథమ స్థానములో ఉందన్నారు. డిజిఎం మునిరత్నం నాయుడు మాట్లాడుతూ కడప జిల్లాను ఈ రంగంలో మరింత పురోభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్.ఎం శ్రీనివాసులు, బి.ఎం. శేషారెడ్డి, ఉమ్మడి కడప జిల్లా ఉద్యోగులు ఏజెంట్స్ 200 మంది పాల్గొన్నారు. సంస్థలో బాగా పనిచేసిన వారిని శాలువాలు జ్ఞాపికలతో సత్కరించారు.

స్వర్ణోత్సవాలను ప్రారంభిస్తున్న పసుపులేటి శంకర్

సహాయ సంచాలకులు రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎపిజిఎల్ఐ చెల్లింపుల్లో ఆలస్యం తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా సంస్థ ఎపిజిఎల్ఐ పరిణతి బాండ్ల చెల్లింపులో, లోన్ల చెల్లింపులో ఆలస్యం తగదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మంగళవారం ఎపిజిఎల్ఐ జిల్లా కార్యాలయంలో సహాయ సంచాలకులు రమేష్ బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది ఉపాధ్యాయుల జీవిత బీమా పాలసీలు మెచ్యూర్ అయ్యాయని, వాటిని డీడీవోలు ఆమోదించి ఎపిజిఎల్ఐ కార్యాలయానికి పంపారని తెలిపారు. కార్యాలయంలో సుదీర్ఘ కాలంగా వాటిని పరిష్కరించకుండా ఉంచారని చెప్పారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఆర్థికంగా ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. వ్యక్తిగత, ఆరోగ్య అవసరాల నిమిత్తం రుణాలు పెట్టుకున్న ఉపాధ్యాయుల విషయంలోనూ ఆలస్యం అవుతుందని తెలిపారు. మెచ్యూర్ అయిన బాండ్లు, రుణాలు త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సహాయ సంచాలకులు రమేష్ బాబు స్పందిస్తూ సిబ్బంది కొరత వల్ల ఆలస్యం అవుతున్న మాట వాస్తవమేనని పేర్కొన్నారు. త్వరితగతిన ఆమోదం పొందే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చూసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి నాయకులు గోపీనాథ్, వై.రామకేశవ, బత్తుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గౌస్‌పీర్‌ను అభినందిస్తున్న షర్మిల, విజయ్యజ్యోతి

గౌస్‌పీర్‌ను ప్రశంసించిన పిసిసి, డిసిసి అధ్యక్షులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ పీర్‌ను పిసిసి, డిసిసి అధ్యక్షులు షర్మిల, విజయ జ్యోతి అభినందించారు. ఐదు రోజులుగా గౌస్ నగర్‌లోని 'ఇంటింటికి కాంగ్రెస్' అనే నినాదంతో ప్రతి ఇంటికీ తిరిగి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులను కలిసి పరిష్కారం కోసం కృషి చేయడం, స్థానికులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో పిసిసి, డిసిసి అధ్యక్షులు గౌస్‌పీర్‌ను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రశంసించారు. పార్టీలో సముచిత స్థానానికి అర్హుడని పేర్కొన్నారు. పార్టీ కోసం పని చేసే వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

మండలంలోని దొమ్మర నంద్యాల హైస్కూల్‌లో విద్యార్థులను పట్ల అసభ్య పదజాలంతో దూషిస్తున్నట్లు వస్తున్న ఆరోపణ నేపథ్యంలోవిద్యాశాఖ అధికారులు సమగ్ర విచారించి సంబంధిత ఉపాధ్యాయులుపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా బుద్ధులు నేర్పించాల్సినటువంటి ఉపాధ్యాయులే ఇలా ఇష్టం వచ్చినట్టు అసభ్య పదజాలంతో మాట్లాడడం దారుణమని తెలిపారు. ఏదైనా తప్పు చేస్తే దండించాలి తప్ప ఇలా అసభ్య పదజాలంతో దూషించడం ఏంటని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో దొమ్మర నంద్యాల హైస్కూల్‌లో వస్తున్న వరుస ఆరోపణలు, సంఘటన పైన విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా కట్టడి చేయాలని, లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలో చేస్తామని పేర్కొన్నారు.

వైఎస్ఆర్‌కు జగన్, షర్మిల నివాళి

తండ్రి వైఎస్ఆర్ సమాధికి నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్

తండ్రి సమాధికి నివాళులర్పిస్తున్న పిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి - వేంపల్లె/పులివెందుల టౌన్/లింగాల

వైఎస్ఆర్ కడప జిల్లా వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఘాట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల వేర్వేరుగా నివాళులర్పించారు. రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా జగన్ తన సతీమణి భారతి, తల్లి విజయమ్మతో కలిసి వైఎస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తమ తండ్రి వైఎస్ఆర్‌కు నివాళులర్పించేందుకు మూడు రోజుల పర్యటనలో భాగంగా జగన్ పులివెందులకు వచ్చారు. వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన అనంతరం ఇడుపులపాయ నుంచి లింగాలలో జలహారతి ఇచ్చేందుకు వెళ్లారు.

జగన్ ఇడుపులపాయ నుంచి వెళ్లిన తర్వాత పిసిసి అధ్యక్షులు షర్మిల తన తండ్రికి నివాళులర్పించేందుకు తల్లి విజయమ్మ, కుమార్తె అంజలి, కుమారుడు రాజారెడ్డి, కోడలు అట్లూరి ప్రియాతో కలిసి ఘాట్ వద్దకు చేరుకున్నారు. గంట పాటు వైఎస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వైఎస్ఆర్ సమాధికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షర్మిల విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు వైఎస్ఆర్‌ను గుండెల్లో చిరకాలం పెట్టుకుని ఆరాధిస్తున్నారన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి, ధృవకుమార్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాషా, సింగం రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, శివమోహన్‌రెడ్డి, నరసింహులు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాల గరవం బాబు, సత్యసాయి ఉపాధ్యక్షుడు చిలమర్తురు మోహన్ గాంధీ పాల్గొన్నారు.

గంగమ్మకుంటకు జలహారతి ఇస్తున్న జగన్

ప్రభుత్వమే ఉల్లి కొనుగోలు చేయాలి : జగన్

ప్రభుత్వమే ఉల్లి పంటను కొనుగోలు చేయాలని మాజీ సిఎం జగన్ అన్నారు. మండలంలోని తాళ్లపల్లెలో బైపిరెడ్డి, జయరామిరెడ్డి అనే రైతులు తమ పంట పోలాల్లో సాగు చేసిన ఉల్లి పంటను మాజీ జగన్ పరిశీలించారు. పంటల సాగుపై రైతులతో మాట్లాడారు. చీనీ, అరటి, నిమ్మతో పాటు ఆయా పంటలు సాగు చేసిన రైతులు అందరూ జగన్ రెడ్డి ముందు పంటలు సాగు చేసిన గిట్టుబాటు ధర లేక నష్టాలపాలు అవుతున్నట్లు రైతులు వాపోయారు. కూటమి పాలనలో గ్రేడింగ్ ఉన్న ఉల్లి క్వింటాళ్ల రూ.800 ఉండగా గ్రేడింగ్ తగ్గిన ఉల్లికి రూ.300 నుంచి రూ.500 వరకు పలుకుతున్నట్లు రైతులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. రైతులు సాగు చేసిన పంటలను విడిచి పెట్టే ఆలోచనలో రైతులు ఉన్నారని ప్రభుత్వం పట్టించుకోవాలని చెప్పారు. కూటమి పాలనలో అరటి పంట రూ.3 వేలకు కోసేందుకు ముందుకు రావడం లేదని చెప్పారు. వైసిపి ప్రభుత్వ పాలనలో అరటి రూ.30 వేలు పలికిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులను పూర్తిగా గాలికి వదిలేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంగా ఎన్నికలు జరపాలి

ప్రజాస్వామ్యంగా ఎన్నికలు జరిపే ధైర్యం టిడిపికి లేదని, జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజలు ఓటు వేసే అవకాశం కూడా కల్పించలేకపోయారని, పోలీసులు అడ్డుపెట్టుకొని దౌర్జన్యాలు చేశారని, రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా సంతోషంగా లేరని జగన్ అన్నారు. నల్లపరెడ్డిపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. దౌర్జన్యం, అన్యాయం చేయాలని చూస్తే ప్రజలు వచ్చే ఎన్నికల్లో టిడిపిని బంగాళాఖాతంలో కలిపేస్తామన్నారు.

అంబకపల్లె గంగమ్మకుంట ప్రారంభం

మండలంలోని అంబకపల్లెలోని గంగమ్మకుంటను జగన్ ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వం హయాంలో రూ.1.40 కోట్లతో 14 ఎకరాలలో రూపకల్పన చేసుకున్న గంగమ్మకుంటకు ఎంపీ అవినాష్‌రెడ్డితో కలిసి జగన్ జలహారతి ఇచ్చారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని వినతి

ప్రజాశక్తి- కడప అర్బన్

లోకేష్‌కు సమస్యను విన్నవిస్తున్న లక్ష్మీదేవి

అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న కార్యకర్తలకు, ఆయాలకు జీతాలు పెంచాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి కోరారు. మంగళవారం చింత కొమ్మదిన్నె మండలంలో పర్యటనకు వచ్చిన ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. అంగన్వాడీ సెంటర్లకు సన్న బియ్యం సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన వెంటనే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రూరల్ ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కారదర్శులు నాగలక్ష్మి,అరుణ, మండల నాయకులు శాంతమ్మ, ప్యారి జాన్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాల్వను ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

పాతకడప దళితవాడలో పర్యటిస్తున్నసిపిఎం నాయకులు

నగరంలోని పాత కడప దళితవాడలో చిన్న చిన్న కాల్వలను కలిపే ప్రధాన డ్రెయినేజీని తక్షణమే ఏర్పాటు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని పాత కడప దళితవాడలో సిపిఎం నాయుకులు, ప్రజా సంఘాల నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ పాత కడప దళితవాడ ఏర్పడి దాదాపు 40 సంవత్సరాలు అయిందని, ఇప్పటివరకు ప్రధాన కాల్వ ఏర్పాటు చేయలేదన్నారు. దీని వల్ల మురుగునీరు అంతా ఒకేచోట పేరుకుపోయి ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. వర్షాకాలం వస్తే ఆ ప్రాంతమంతా విపరీతంగా దోమలు విలయతాండవం చేస్తున్నాయని చెప్పారు. మురుగునీరు పేరుకు పోవడం వల్ల చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు జబ్బుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. దీనికోసం లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు అక్కడ మురుగునీరు నిలువ ఉండకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం మీద ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం తక్షణమే కడప కార్పొరేషన్ అధికారులు, ప్రధాన మురుగు కాల్వలో చెత్తను తీసి వృధా నీటిని పంపేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను అక్టోబర్ 2 గాంధీ జయంతి లోపల పరిష్కారం చేయాలని, లేని పక్షంలో ప్రజానీకాన్నీ కలుపుకుని సిపిఎం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడుతుందని హెచ్చరించారు. పోరాటానికి ప్రజానీకం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, పార్టీ నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కెవిపిఎస్ నగర కన్వీనర్ దాసరి నరసింహ, గోవిందు, పిఎన్ఎం నగర కార్యదర్శి వరలక్ష్మి, సి.పి.రమణ, హరి, చంద్రశేఖర్, సురేందర్, మీనాక్షి, మరియమ్మ, మేరతమ్మ, లక్ష్మీ దేవి, కుమారి, బాల చెన్నమ్మ, దేవమ్మ , రాజేశ్వరి, మేరీ, మాధవి, కాంతమ్మ, తిరుపాలమ్మ పాల్గొన్నారు.

జ్యోతి క్షేత్ర అభివృద్ధికి సహకారం అవసరం

ప్రజాశక్తి-కాశినాయన : మండల పరిధిలోని కాశీనాయన జ్యోతి క్షేత్ర అభివృద్ధికి, అక్కడ ఆగిపోయిన ఆలయ పనులను నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు ఇచ్చేందుకు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి బద్వేల్ ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి మండల నాయకులు బసిరెడ్డి రవీంద్రారెడ్డి మంత్రి లోకేష్‌కు విన్నవించారు. ముందుగా కాశినాయన చిత్రపటాన్ని ఆయనకు గౌరవ మర్యాదలతో అందజేశారు. స్పందించిన ఐటి మంత్రి లోకేష్ జ్యోతి క్షేత్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు బాలేపల్లి కృష్ణారెడ్డి, ఆకుల నారాయణపల్లి ఈశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్య.కా.స జాతీయ కౌన్సిల్
సమావేశాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కడప నగరంలోని హరిత హోటల్‌లో ఈనెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సిపిఎం పట్టణ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం జమ్మలమడుగు పట్టణ కమిటీ విస్తృత సమావేశం దాసు అధ్యక్షతన నిర్వంచారు. అంతకు ముందు కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ సమావేశాలకు కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపుర, రాజస్థాన్, తమిళనాడు తదితర 22 రాష్ట్రాల ప్రతినిధులతో పాటు, కేరళ ప్రభుత్వ చైర్పర్సన్ మాజీ ఎంపీ విజయ రాఘవన్, ప్రస్తుత రాజ్యసభ సభ్యులు డాక్టర్ శివదాసన్, బెంగాల్ త్రిపుర మాజీ మంత్రులు హాజరవుతున్నారన్నారు. గ్రామీణ వ్యవసాయ కార్మికుల సమస్యలపై జరిగే చర్చలు సఫలం కావాలని, సిపిఎం కడప జిల్లా కమిటీ కోరుకుంటుందన్నారు. దేశంలో ప్రజలు 100 కి 68 మంది గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యధికులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. వ్యవసాయం లాభదాయకంగా లేదని, పాడి పరిశ్రమ మూతపడిందని, పాలక ప్రభుత్వాలు ఆదుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. భవిష్యత్తు తరాలకు ఆహార ధాన్యాల కొరత రానుందని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి, ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి పాలక ప్రభుత్వాలు ఊహాజనిత అభివృద్ధి పేరిట, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని అధికారులు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొం టున్నారని, తప్పుడు పనులు చేయలేక సెలవులు పెట్టి పోతున్నారని, పేద ప్రజలు కోర్టుల్లో న్యాయపోరాటాలకు సంసిద్ధం కావాల్సిన దుర్గతి ఏర్పడిందని వారు తెలిపారు. విస్తృత సమావేశంలో సిపిఎం కమిటీ సభ్యులు దాసరి విజయ్. శాఖా కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మైల వరంలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సమావేశాల కరవ త్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కొండయ్య, దాసు, ముని, సంజీవ రాయుడు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** ఈనెల 8 నుంచి 10 వరకు మూడు రోజులపాటు కడప నగరంలో హరిత హోటల్‌లో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కార్మిక, వ్యవసాయ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కడపలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రా మ్మోహన్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, కెవిపిఎస్ నగర కన్వీనర్ నరసింహ, నాయకులు గోవిందు, ప్రజానాట్యమండలి నగర కన్వీనర్ పి.సి.రమణ పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్య.కా.స జిల్లా నాయకులు కె.శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముడియం చిన్ని, నాగార్జున, కొండయ్య, శివ, కైరూన్ బీ,సుబ్బారాయుడు, రాయప్ప,ప్రసాద్, మస్తాన్ బీ, బాలమ్మ, రాజగోపాల్, వెంకతపతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు చారి, వెంకటరత్నం పాతిమ రాజగోపాల్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

అంతర పంటగా మొక్కజొన్న.. పెట్టుబడికి ఢోకాలేదన్నా

అంతర పంటగా మొక్క జొన్న

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రైతులు తక్కువ పెట్టుబడితో లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం మొక్కజొన్న ధర ఎక్కువగా ఉంటుందని ఆలోచించిన మండలంలోని పి.బొమ్మేపల్లి పంచాయతీలోని రైతులు కొందరు మెనో క్రాప్ (ఏకపంట)గా, మరికొందరు పసుపులో అంతర పంటగా మొక్కజొన్నను అధికంగా సాగు చేశారు. ముందుగా కోతకు వచ్చిన పంట జూలై, ఆగస్టుకు పచ్చిబుట్టకే అధిక ధర దక్కడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పచ్చి బుట్ట ధర వారం రోజుల క్రితం వరకు రూ.100కి 10 పలుకగా, ప్రస్తుతం రూ.50కి 7 రూ.100కి 15 పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎకరానికి మొదట ఏక పంటలో రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. పంట కోత తర్వాత సొప్పను కూడా పశువుల, గొర్రెలు, మేకలకు దాణాగా ఎకరా రూ.10 నుంచి రూ.15 వేలకు అమ్మారు. ఇటీవల వర్షాలు పడడంతో రూ.8వేల నుంచి రూ.10 వేల పలుకుతోంది. అంతర పంటల సాగులో ప్రస్తుతం ఎకరా రూ.25వేల నుంచి రూ.30 వేలు పలుకుతుంది. మరి కొంతమంది అలాగే పొలంలో దున్ని కుళ్లింపజేసి, వరి నారు నాటుతున్నారు.

ఖర్చు తక్కువ-దిగుబడి ఎక్కువ

సాధారణంగా మొక్కజొన్న సాగు చేసే రైతులకు ఎకరానికి 6 కిలోల విత్తనాలను రూ.3,700, పొలం దున్నడానికి, విత్తనాలు నాటేందుకు, కూలీలకు, సత్తువలకు ఏక పంటలో అయితే రూ.7వేల వరకు కాగా, విత్తనాలతో కలుపుకొని ఎకరాకు రూ.12 వరకు ఖర్చవుతోంది. అంతర సాగులో అయితే 3కిలోల విత్తనాలు వాడుతున్నారు. రూ.5 వేల వరకు ఖర్చు వస్తుంది. కానీ, పచ్చిబుట్ట రాగానే మినిమం ఎకరానికి ఏక పంటలో అయితే 4 ట్రాక్టర్లు, అంతర పంటలతో 2 ట్రాక్టర్లకు తగ్గకుండా దిగుబడి వస్తుండడంతో ఆదాయం కనబడుతోందని రైతులు పేర్కొంటున్నారు. అడవి పందుల నుంచి పంటను కాపాడుకోవడంతోపాటు మంచి ధర పలుకుతుండడంతో రైతులు పచ్చిబుట్ట విక్రయానికే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

కంకులు చొప్పున విక్రయం

రైతుల వద్ద నుంచి ఎకరా చొప్పున కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. పట్టణాల్లో కంకుల ప్రకారం విక్రయిస్తామంటున్నారు. ఇటు రైతులకు, అటు వ్యాపారులకు మొక్కజొన్న పచ్చిబుట్ట ద్వారా మంచి ఆదాయం లభిస్తోంది.

మొక్కజొన్న సాగుపై రైతుల్లో ఆసక్తి

చాపాడు : మండల పరిధిలో రైతులు ఆరుతడి పంటలపైన ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, మినుము పంటల సాగు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. సాధారణంగా కుందూ, పెన్నా, కెసి పరివాహక గ్రామాల్లో వరి పంటను రైతులు అధికంగా సాగు చేపడుతారు. అయితే వరి పంట సాగుకు ఖర్చులు అధికమవుతుండడం, ధాన్యం ధరలు డిమాండ్ లేకపోవడంతో రైతులు ఇతర పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. మెట్ట ప్రాంతాలు, కెసి నీరు అంత సులభంగా ప్రవహించని ప్రాంతాల్లో ఆరుతడి పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్లో సిద్ధారెడ్డిపల్లి, జాల్లిగారి కొట్టాలు, ముద్దాయపల్లి, రేపల్లె తదితర గ్రామాల పరిధిలో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేపట్టారు. గత వారంలో అధికంగా పడిన వర్షాలకు మొక్కజొన్న పంట కాస్త దెబ్బ తింది. ప్రస్తుతం వాతావరణంలో మార్పు రావడంతో పంట కోలుకుంటోందని రైతులు పేర్కొంటున్నారు. ఆరుతడి పంటల సాగు వల్ల రూ.పది ఖర్చులు పోను మిగులుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చాపాడు : సిద్ధారెడ్డిపల్లె వద్ద సాగులో ఉన్న మొక్కజొన్న

మంత్రి లోకేష్‌కు సమస్యలను వివరిస్తున్న రామమునిరెడ్డి

రోడ్డు పనులకు నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో రోడ్డు పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి కడపకు విచ్చేశారు. ఈ సందర్భంగా రామమునిరెడ్డి మంత్రిని కలిసి గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్ల దుస్థితి గురించి వివరించారు. రోడ్డు పనులు పూర్తికాక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిఎన్ఎస్ఎస్ కాలువ నుండి ముచ్చుకొన చెరువుకు నీరు తెప్పించే పనులు కూడా నత్తనడక సాగుతున్నట్లు తెలిపారు. జిఎన్ఎస్ఎస్ కాలువ నుండి ముచ్చుకొన చెరువుకు నీళ్లు వస్తే రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి తమ దృష్టికి తెచ్చారని మంత్రి గుర్తు చేశారు. స్పందించిన మంత్రి ముచ్చుకొన చెరువుకు నీరు సరఫరా చేసి రైతులకు ప్రయోజనం కలిగిస్తానని హామీ ఇచ్చారని రామమునిరెడ్డి చెప్పారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్, నల్లంశెట్టి నాగార్జున

భవిష్యత్ దార్శనికుడు పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ భవిష్యత్ దార్శనికుడని ఆ పార్టీ జమ్మలమడుగు కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. డిప్యూటీ సీఎం జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం జమ్మలమడుగు జనసేన కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. నల్లంశెట్టి నాగార్జునతోపాటు 50 మంది రక్తదానం చేశారు. రోగులకు పండ్లు బెడ్లు పంపిణీ చేశారు. నీలం రమేష్, పవన్‌కుమార్, శేఖర్‌రెడ్డి, కాటమరాయుడు, నరసింహ, సన్నీ, విజయ్, వినయ్, జనసేన వీర మహిళ వైష్ణవి, విజయరాజు, సుధాకర్, కిరణ్, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సురభి నాగలగట్టుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పులివెందుల నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. రోగులకు పండ్లు, బ్రేడ్ పంచి పెట్టారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఇడుపులపాయ మాజీ సర్పంచ్ చలపతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాగమ్మ నగర్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సురభి నాయకులు శివ, కల్యాణ్, దినేష్, సురభి జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని వైద్యాధికారి డాక్టర్ స్నేహ ప్రత్యూష సూచించారు. పట్టణ పరిధిలోని నగరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ స్నేహ ప్రత్యూష ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రతి రోజూ మీకు కేటాయించిన గృహాల్లో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేయాలన్నారు. ఎవరికైనా జ్వరం ఉన్నట్లు అయితే వెంటనే రక్త పరీక్ష చెయ్యాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతూంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు మాత్రమే వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారని ప్రజలకు వివరించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో శేషగిరి నాయక్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ద్వారా అరచేతిలోనే విజ్ఞానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇంటర్నెట్ ద్వారా విజ్ఞానం అరచేతిలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని ప్రముఖ రచయిత జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక జెవివి కార్యాలయంలో ఇంటర్నెట్ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా సివిల్ సర్వీస్ కోర్సు శిక్షణ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిక జీవితంలో ఇంటర్నెట్ ఒక భాగంగా మారిందన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీమోహన్ రాజు మాట్లాడుతూ కాలంతో పోటీ పడుతున్న ప్రస్తుత తరుణంలో ప్రత్యేకించి మనిషికి సాంకేతిక పరిజ్ఞానం సైన్స్ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వర రావు

ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రైతులకు అందాల్సిన ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జమ్మలమడుగు డిఎస్‌పి కె.వెంకటేశ్వర రావు హెచ్చరించారు. ఎస్‌పి ఇజి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రైతుల పాస్ బుక్కులు చూసి ఎన్ని ఎకరాలకు ఎంత మేర అవసరం ఉంటుందో ఆ మేరకు మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు. విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. లైసెన్స్, విక్రయ రికార్డులను తనిఖీ చేశారు. యూరియా, ఫాస్ఫేట్, నత్రజని ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే షాపులు సీజ్ చేయడంతోపాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో జమ్మలమడుగు అర్బన్ సిఐ పి.నరేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట : రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచుతామని, రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని కడప డివిజన్ ఎడిఎ సురేష్ కుమార్ రెడ్డి, ఎఒ నగార్జున, ఎంపిడిఒ దివిజా సంపతి, స్థానిక సిఐ వంశీధర్ తెలిపారు. మంగళవారం రావులపల్లె సచివాలయం వద్ద చేపట్టిన యూరియా పంపిణీ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్ర మంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో మ్యాట్ యాప్‌ను ఆవిష్కరించిన డైరెక్టర్

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఆర్-21 బ్యాచ్ విద్యార్థులు రూపొందిన ఆటో మ్యాట్ యాప్‌ను మంగళవారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు ఎదుర్కొనే ఆటో సమస్యలను పరిష్కరించడానికి ఈ యాప్ ప్రత్యేకంగా రూపకల్పన చేశారన్నారు. గతంలో విద్యార్థులు ఆటో కోసం ఎక్కువసేపు వేచి చూడడం జరిగేదన్నారు. ఒకే ఆటోలో ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించడంతో అసౌకర్యం కలిగేదని తెలిపారు. సమయపాలనలో స్పష్టత లేకపోవడంతోపాటు భద్రత, సౌకర్యం ఉండేదికాదన్నారు. ఆటో యాప్ ఈ సమస్యలకు సమగ్ర పరిష్కారం అందిస్తుందని వివరించారు. ఆటో యాప్ ద్వారా షెడ్యూల్ ప్రకారం ఆటోలు అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థుల ప్రయాణాన్ని సులభతరం చేయడమే కాకుండా, పారదర్శకత, భద్రతను తీసుకురావడమే ఈ యాప్ ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం ఆటో యాప్‌ను రూపొందించిన విద్యార్థులు శివశంకర్, సాయినాథ్, రవితేజ, అంకిత్ కుమార్, సాయికుమార్, మణికుమార్‌ను అభినందించి, సర్టిఫికెట్లును అందజేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్, డీన్ అకాడమిక్ రమేష్ కైలాష్, సిఎస్‌సి హెచ్‌ఒడి రత్నకుమారి, సెక్యూరిటీ ఆఫీసర్ శరవణకుమార్, అసోసియేట్ డీన్స్ వీరరాఘవరెడ్డి, అడ్మిన్ లింగమూర్తి, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆటో యాప్ రూపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డైరెక్టర్

ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు

రక్తదాన శిబిరంలో వైఎస్ మనోహర్‌రెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక వైఎస్ఆర్ ఆడిటోరియంలో వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. దాదాపు 400 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, కోడి రమణ, దాసరి చంద్రమౌళి, వేలమారపల్లె భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోళ్ల భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి వేడుకలను సింహాద్రిపురంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్, గురజాల సర్కిల్, వైఎస్ఆర్ మెమోరియల్ పార్క్, కుమ్మరంపల్లి కాలనీలోని వైఎస్ విగ్రహాలకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు వెన్నపూస అరవింద్‌రెడ్డి, ఎంపిటిసి జాఫర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నీలవర్ధన్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. **వేంపల్లె :** దివంగతనేత రాజశేఖర్‌రెడ్డి అసలుసిసలు కాంగ్రెస్ వాది, కారణజన్ముడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, ఐచర్ రమణ, నాగరాజు, రవీంద్రనాథ్‌రెడ్డి, చెన్నకేశవ, బండారు వెంకటేశు, రవి, ప్రతీష్, శ్రీనివాసులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం వైసిపి మండల అధ్యక్షులు నడమల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి గజమాల వేసి నివాళులర్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, స్టేట్ ఐటి వింగ్ జాయింట్ సెక్రటరీ ఆకుల రవికుమార్, రాజశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, సూర్యమునిరెడ్డి, రమణ, వెంకట్, సుబ్రమణ్యం, విజయ్, వాసు పాల్గొన్నారు. **వేముల :** మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆ మహానేతకు వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పిటిసి కోకటం వెంకటబయపు రెడ్డి, పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. పులివెందుల-కడప ప్రధాన రహదారి పక్కన వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్ల గంగాదేవి, మాజీ జెడ్పిటిసి మరక శివకృష్ణారెడ్డి, చాగంటి భాస్కర్, నారబోయిన గంగాధర, చల్ల వెంకట్ నారాయణ, చలపతి, రాధా కృష్ణ, గంగరాజు, శివశంకర్‌రెడ్డి, బస్సు సుబ్బారెడ్డి, ఎద్దుల భాస్కర్‌రెడ్డి, దేవన రామాంజనేయులు, సొహెల్, ముస్కిన్‌వల్లి, వేమ నారాయణరెడ్డి, రాఘవరెడ్డి, మహేష్‌రెడ్డి, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి సాయిరాం థియేటర్ దగ్గర ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గజ్జల లక్ష్మయ్య, ఒకటో వార్డు కౌన్సిలర్ ముల్లా జానీ, పొన్నతోట సుబ్రహ్మణ్యం, గూడెంచెరువు నాగేశ్వర్‌రెడ్డి, గౌతమబోయిన గురుమూర్తి యాదవ్, మహేశ్వర్‌రెడ్డి, భారీ ఎత్తున మైలవరం, పెద్దమడియం, జమ్మలమడుగు మండలాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **కాశినాయన :** వైఎస్ రాజశేఖర్‌రెడ్డ 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పోరుమామిళ్ల పట్టణంలో నల్లేరు విశ్వనాథ రెడ్డి తన కార్యాలయం వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పోరుమామిళ్ల ప్రధాన రహదారిలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్దనున్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి భారీ జన సమూహంతో ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి ఎదురుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **కడప :** డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని కడప నగరంలోని వైసిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి.అంజద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు, కో ఆప్షన్ మెంబర్లు, అనుబంధ సంఘాల నాయకులు నాయకులు, పాల్గొన్నారు. అంతకుముందు పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్దనున్న వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. **కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..** వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వాటి జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **చింతాకొమ్మదిన్నె :** వైఎస్ఆర్16వ వర్ధంతి సందర్భంగా రాయచోటి రింగ్ రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మండల కన్వీనర్ గుడా ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసిలు సుధాకర్ రెడ్డి, సర్పంచ్ సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ శ్రీ రామ్ రెడ్డి, కమలాపురం నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ ఈశ్వర్ రెడ్డి చిట్టి పోయిన సుబ్బరాయుడు, రామాంజనేయులు, మాజీ ఎంపిటిసి పల్లా పెంచల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **చాపాడు :** వైసిపి ఆధ్వర్యంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య, ఉప ఎంపిపి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, శాంతరాజు, ప్రసాద్, జమాల్ వల్లి, ఖాసీం, జయసుబ్బారెడ్డి, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎపిజిఇఎ నాయకులు

కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మైదుకూరు తాలూకా కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ సంఘ అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆర్.నరసింహ ప్రతాప్ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కోరారు. ఆ మేరకు సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, కార్యకలాపాల నిర్వహణకు ఒక సొంత కార్యాలయం ఎంత అవసరమో వారు ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని పరిశీలిస్తామని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం తాలూకా ట్రెజరర్ బి.హర్షవర్ధన్ రాజు, ఉపాధ్యక్షుడు విజ్జి వినీత్, జాయింట్ సెక్రటరీలు పి.వెంకటయ్య, ఎన్.సురేంద్ర, హెచ్.సతీష్, సి.రాజవలి పాల్గొన్నారు.

రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా 'అన్నవరం'

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి చాపాడు మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డిని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. తన నియామకానికి సహకరించిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను మంగళవారం ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యే రాష్ట్ర డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం స్థానిక టిడిపి నాయకులు అన్నవరం సుధాకర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ ద్వార్శాల గురివిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, లోకేశ్వర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి పైపులైను తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి - చాపాడు

బెంగళూరు, విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో మండల పరిధిలోని సోమాపురం వద్ద ఏర్పాటు చేసిన సాగునీటి పైపులైను రాజకీయ కక్షలతో అన్యాయంగా తొలగిస్తున్నారని బాధితులు మంగళవారం వాపోయారు. గ్రామానికి చెందిన అంకిరెడ్డిపల్లి రామచంద్రారెడ్డి, కొండారెడ్డి, భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తమకు సంబంధించిన 8 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లను టిడిపి నాయకులు రాజకీయ కక్షతో పోలీసులు అండతో తొలగిస్తున్నారన్నారు. తమ భూములకు నీరు ప్రవహించే ఏర్పాటు చేపట్టి కాలువలను తొలగించాలని కోరినప్పటికీ స్పందించడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తే సాగునీటి వసతి కల్పించిన తర్వాత పైపులైను తొలగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ దౌర్జన్యంగా తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. గత వారంలో పోలీస్ సిబ్బంది పైపులైన్లను ఏర్పాటు చేయించి ప్రస్తుతం వారే తొలగించేందుకు సహకరిస్తున్నారన్నారు. ఉన్నత అధికారులు న్యాయం చేయకపోతే కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడతామన్నారు. వ్యవసాయ భూములకు సంబంధించి రాజకీయాలు అంటగట్టి పాత కక్షలతో ఇబ్బందులకు గురి చేయడం తగదని ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

ఉపాధ్యాయునిపై సమగ్ర విచారణ జరపాలి

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలంలోని దొమ్మర నంద్యాల హైస్కూల్‌లో విద్యార్థుల పట్ల అసభ్య పదజాలంతో దూషిస్తున్నట్లు వస్తున్న ఆరోపణపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి సంబంధిత ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, నిజమని తేలితే సంబంధిత ఉపాధ్యాయునిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కట్టడి చేయాలన్నారు. లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలో చేస్తామని హెచ్చరించారు.

కాపర్ తీగలు చోరీకి యత్నం

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ప్రజాశక్తి - ముద్దనూరు

తాడిపత్రి రహదారిలోని గజ్జల చిన్న రంగారెడ్డి మెమోరియల్ ఐటిఐ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ తీగలు చోరీకి సోమవారం రాత్రి దుండగులు యత్నించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన తీగలు తెంపేసి దిమ్మెపై నుంచి కింద పడేసి ధ్వంసం చేశారు. నెల రోజుల వ్యవధిలో ఆరవేటిపల్లె, శెట్టివారిపల్లె, ముద్ద నూరులోని ట్రాన్స్‌ఫార్మర్లలో విలువైన కాపర్ తీగలు దోచుకెళ్లారు.

మండలంలో నెల రోజుల క్రితం నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్ప డుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై జరుగుతున్న వరుస చోరీలను నియం త్రిం చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరు తున్నారు. ఎలాంటి వస్తువులు, తీగలు ఎత్తుకు పోలేదని విద్యుత్ ఎఇ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 224/2019

ఎన్.నరేష్ రెడ్డి, S/o రామాంజనేయులు రెడ్డి, హిందూ, డోర్‌నెం.28/369, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. **...వాది**

Vs

కె. మునెయ్య, S/o మునెయ్య, హిందూ, హిందూ డిష్ రామక్రిష్ణ ఇంటి ఎదురుగా, వేపరాల గ్రామం, మైలవరం మండలం, కడప జిల్లా. **...8వ ప్రతివాది**

దావా సమను మరియు నోటీసు

పై నెంబరు దావాను దావా ప్రోనోటు వసూలు కోరి దాఖలు చేస్తు మరియు I.A.No.556/2019 నెంబరు అటాచ్‌మెంట్ పిటిషన్ దాఖలు చేసి వుంటున్నారు. అట్టి దావాలో మరియు పిటిషన్‌లో 8వ ప్రతివాది అయిన మీరు హాజరగుటకు గాను 9.9.2025వ తేదీన పై కోర్టులో వాయిదా వుంటున్నది. సదరు వాయిదా నాడు ఉదయం 10.30 ని॥ ఖుద్దున గానీ, వకీలు గారి ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.

//By Order of the Court//

జి.శ్రీనివాసులు, B.Com.,B.L.,
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 273/2018

వి.ఓబయ్య, S/o లేటు వేణుగోపాల్ యాదవ్ @ వేణుగోపాల్ @ గోపాల్, 50 సం॥లు, పొట్టిపాడు గ్రా॥, రాజుపాళెం మం॥, కడప జిల్లా. **...వాది**

Vs

7. వి.ఆంజనేయులు, S/o లేటు భాస్కర్, 40 సం॥లు, పొట్టిపాడు గ్రా॥, రాజుపాళెం మం॥, కడప జిల్లా. **...7వ ప్రతివాది**

నోటీసు

పై నెంబరు దావాలోని 1వ ప్రతివాది అయిన వి.భాస్కర్ గారు గతించినందున ఆయన తరపున మిమ్మల్ని వారసులుగా చేర్చుటకు గాను కలిగిన ఆలస్యంను మన్నించ కోరుచు & మరియు మిమ్మల్ని 7వ ప్రతివాదిగా చేర్చకోరుచు I.A. No.297/2024, I.A.No.298/2024, I.A.No.299/2024 పిటిషన్‌లను దాఖలు చేసి వుంటువున్నారు. అట్టి పిటిషన్‌లో మీరు హాజరగుటకు గాను 11.09.2025వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు పై కోర్టులో ఉదయం 10.30 ని॥ ఆక్షేపణలు ఉన్న యెడల ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షములో ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

//By Order of the Court//

జి.శ్రీనివాసులు, బి.కాం.,బి.ఎల్.,
అడ్వకేటు, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు కడప & ప్రొద్దుటూరులో

I.A.No. 217/2025

A.S.No. 6/2015

1. పి.ఎస్. గౌస్‌బీ (పోతి, వారసులు).
2.ఎస్.ఎమ్.దౌల, S/o ఎస్.అబ్దుల్ గఫూర్ సాహెబ్, 50 సం॥లు, డోర్‌నెం.3/69, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. & వగైరాలు. **...పిటిషనర్లు/అప్పిలెంట్లు**

Vs

5. వి.కల్పన @ V.R.కల్పన, W/o రామిరెడ్డి గారి రామిరెడ్డి, 43 సం॥లు, డోర్‌నెం.4/23, కొండూరు గ్రా॥ & మం॥, కడప జిల్లా.
6. పి.ఈశ్వర్ రెడ్డి, S/o జగదీశ్వర్ రెడ్డి, హిందూ, 46 సం॥లు, డోర్ నెం.15/641, జిన్ను రోడ్డు, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

...5,6 రెస్పాండెంట్లు

నోటీసు

పై నెంబరు పిటిషన్‌ను 5,6 రెస్పాండెంట్లుగా అప్పీలులో చేర్చుకోరుచు దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి పిటిషన్‌లో మీరు హాజరగుటకు గాను 25.09.2025వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా నాడు ఉదయం 10.30 ని॥లకు ఖుద్దున గానీ వకీలు గారి ద్వారా గానీ తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

//By Order of the Court//

జి.శ్రీనివాసులు, బి.కాం.,బి.ఎల్.,
అడ్వకేటు, ప్రొద్దుటూరు.